RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



3 లో స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం అభినందనీయం

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :213 | సంపాదకులు: కలిచేటి వెంకయ్య | బుధవారం 1 జూలై 2026 | పేజీలు: 8 | వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

## వికసిత భారత్ లక్ష్య సాధనలో
# యువతదే కీలక పాత్ర

విశాఖలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి పిలుపు

కేంద్రీయ గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో ప్రసంగం

పట్టభద్రుల్లో 40 శాతం, స్వర్ణ పతక విజేతల్లో 70 శాతం అమ్మాయిలేనని హర్షం

ఆధునిక సాంకేతికతతో గిరిజన సంస్కృతికి పునరుజ్జీవం తీసుకురావాలని సూచన

గిరిజన విశ్వవిద్యాలయాలు ఆత్మవిశ్వాస కేంద్రాలుగా ఎదగాలి

**విశాఖ, సింధూరదర్శిని:** వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో దేశ యువతదే కీలక పాత్ర అని... విద్య, సాధికారతే వారి ప్రధాన ఆయుధాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మన గిరిజనసంస్కృతి, వారసత్వానికి పునరుజ్జీవం తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. మంగళవారం నాడు విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టాలు, పతకాలు అందుకున్న విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులకు, ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.



ఈ యూనివర్సిటీలో పట్టాలు పొందిన విద్యార్థులలో దాదాపు 40 శాతం మంది, స్వర్ణ పతకాలు సాధించిన వారిలో 70 శాతం మంది అమ్మాయిలే కావడం పట్ల ఆమె ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ఇది మహిళా సాధికారతకు, లింగ సమానత్వం పట్ల సంస్థకున్న నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు. గిరిజన విశ్వవిద్యాలయాలపై ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని రాష్ట్రపతి గుర్తుచేశారు. ఈ సంస్థలు కేవలం విద్యా కేంద్రాలుగా మిగిలిపోకుండా, గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం, నాయకత్వం, విధాన రూపకల్పనకు కేంద్రాలుగా మిగతా 2లో...

# ఓటుపోతే ప్రభుత్వ పథకాలూ పోవచ్చు

-'సర్'పై డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు

-ఓటు హక్కు కోల్పోవద్దని డీకే శివకుమార్ సూచన

-ఓటు లేకపోతే పథకాలపై ప్రభావం ఉంటుందని హెచ్చరిక

-కర్ణాటకలో మంగళవారం నుంచి ప్రత్యేక ఓటరు సవరణ ప్రారంభం

-జులై 29 వరకు ఇంటింటి సర్వే

-అక్టోబర్ 7న తుది ఓటరు జాబితా విడుదల



**కర్ణాటక:**ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై కర్ణాటక సీఎం డి.కె.శివ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో 'సర్' ప్రారంభమైన సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా నిర్ధారించుకోవా లని ప్రజలను కోరారు. ఓటు హక్కు కోల్పోతే భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా కోల్పోయే పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. కర్ణాటకలో మంగళవారం నుంచి సర్ ప్రారంభమైంది. జులై 29 వరకు మిగతా 2లో...

# మరింత పటిష్టంగా సమాచార నెట్వర్క్

-కనెక్టివిటీ టూ లాస్ట్ మైల్ అనేదే లక్ష్యం

-డిజిటల్ లిటరసికీ ఆపరేటర్ల సహకారం అవసరం

-సెల్ టవర్ నెట్వర్క్ బలోపేతంపై సర్వీసు ప్రొవైడర్లకు ఆదేశాలు

-రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్వర్క్ పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**అమరావతి, సింధూరదర్శిని:**
సమాచార నెట్వర్క్ అంశంలో ఆంధ్రప్రదేశ్ ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనికేషన్ నెట్వర్క్ ను ఏర్పాటు చేయటం ద్వారా సమాచార వ్యవస్థలో లాస్ట్ మైల్ కనెక్టివిటీ దిశగా పని చేస్తున్నామని సీఎం వెల్లడించారు. కమ్యూనికేషన్ నెట్ వర్క్ ను మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్వర్క్ పై సీఎం వివిధ సర్వీసు ప్రొవైడర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మొబైల్ కవరేజి విషయంలో సర్వీసు ప్రొవైడర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్లు, కమ్యూనికేషన్ నెట్వర్క్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏపీ వ్యాప్తంగా కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా మరిన్ని సెల్ టవర్లను ఏర్పాటు చేయాలని వివిధ కంపెనీల ప్రతినిధులకు సూచనలు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 30,694 సెల్ టవర్లు ఉన్నాయని.. మరో 2310 సెల్ టవర్లను



ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం అవసరమైన మేరకు సర్వీసు ప్రొవైడర్‌లకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. వంద రోజుల్లో సెల్ టవర్లను మిగతా 2లో...

# మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో పవన్‌కళ్యాణ్ భేటీ

తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ చర్యలపై చర్చ

ఆంధ్రప్రదేశ్‌కి రెండు ఆడ పులులు ఇస్తున్నందుకు కృతజ్ఞతలు

**మహారాష్ట్ర:** ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.



మంగళవారం ముంబైలోని మహారాష్ట్ర ముఖ్యమంత్రి వారి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై ఇరువురు నేతల మధ్య ఫలవంతమైన చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్

## అమర్‌నాథ్ యాత్రకు
# ఉగ్రముప్పు
## కేంద్రం హైఅలర్ట్!

అమర్‌నాథ్ యాత్రపై నిఘా సంస్థల సమాచారంతో అప్రమత్తత

యాత్ర మార్గంలో కట్టుదిట్టమైన భద్రత

ఏఐ కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ ఏర్పాటు

జమ్ముకశ్మీర్‌లో కొనసాగుతున్న గాలింపు చర్యలు

యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని విజ్ఞప్తి

జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం



వివరాలు 2 లో



# ఏపీలో విద్యా సంస్కరణలు భేష్

నారా లోకేశ్‌పై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసల వర్షం

భోగాపురం పీఎంశ్రీ మోడల్ స్కూల్‌ను సందర్శించిన కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, లోకేశ్

పాఠశాలలో ఆధునిక విద్యాబోధన, టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించిన బృందం

లీప్ డ్యాష్‌బోర్డు, స్మార్ట్ కిచెన్ల వ్యవస్థ గురించి కేంద్ర మంత్రికి వివరించిన లోకేశ్

తరగతి గదిలో విద్యార్థులతో సరదాగా ముచ్చటించి వారి నైపుణ్యాలను పరిశీలించిన మంత్రులు

**అమరావతి, సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్ విద్యారంగం అభివృద్ధికి, నూతన విద్యావిధానాల అమలుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధతో చేస్తున్న కృషి అభినందనీయమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు లోకేశ్ చూపిస్తున్న చొరవను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. మంగళవారం విజయనగరం జిల్లా భోగాపురంలోని పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్‌ను మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ధర్మేంద్ర ప్రధాన్ సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలలో మిగతా 2లో...

## ఓటు పోతే ప్రభుత్వ పథకాలూ పోవచ్చు

(మొదటిపేజీ తరువాయి)

ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించే ప్రక్రియ కొనసాగనుంది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ "ఓటు హక్కు అంటే జీవించే హక్కు" అని వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ఆధారంగా అర్హత లేని రేషన్ కార్డుదారులను తొలగించే చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఇదే దిశగా అడుగులు వేస్తున్నాయని తెలిపారు. అందుకే ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఈ ప్రక్రియను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని నిర్ణయించింది. దీన్ని ఆన్‌లైన్‌తో పాటు సేవా కేంద్రాల ద్వారా కూడా పొందే అవకాశం కల్పించింది. ఓటరు వివరాల ధ్రువీకరణలో ఇది నివాస ఆధారంగా ఉపయోగపడనుంది. ఈ దశలో ఎలాంటి పత్రాలు తీసుకోబోమని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఫారం పూర్తిగా నింపి సంతకం చేసి అధికారులకు అందజేయాలని ఓటర్లను కోరింది. మొత్తం ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతుందని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని అధికారులు తెలిపారు. ఆగస్టు 5న ముసాయిదా ఓటరు జాబితా విడుదల కానుంది. సెప్టెంబర్ 4 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 7న ప్రకటించనున్నారు.

## మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో పవన్‌కళ్యాణ్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ "ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. వారు అందిస్తున్న సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుంది. తూర్పు కనుమల్లో ఆడ పులుల ప్రవేశంతో అంతరసంతానోత్పత్తి సమస్యలను అధిగమించడంతో పాటు, జన్యు వైవిధ్యం పెరిగి, పులుల సంఖ్య దీర్ఘకాలిక స్థిరత్వానికి దోహదపడుతుంది. తద్వారా తూర్పు కనుమలలో ఆరోగ్యకరమైన, స్వయం సమృద్ధి కలిగిన పులుల ఆవాస వ్యవస్థ ఏర్పడుతుంది. శాస్త్రీయ విధానాలు, స్థిరమైన వన్యప్రాణి నిర్వహణ ఆధారంగా జీవ వైవిధ్య పరిరక్షణకు ఇరు రాష్ట్రాలు కట్టుబడి ఉన్నాయన్న అంశాన్ని ఈ సంయుక్త సంరక్షణ కార్యాచరణ ప్రతిబింబిస్తోంది. ఆంధ్రప్రదేశ్-మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఏర్పడిన ఈ భాగస్వామ్యం తూర్పు కనుమలలో పులుల దీర్ఘకాలిక సంరక్షణకు విశేషంగా దోహదపడుతుందని విశ్వసిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మాకు నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ గారికి కూడా ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. వన్యప్రాణి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ లక్ష్యాల సాధనలో మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి మరింత సమన్వయంతో ముందుకు వెళ్తామ"న్నారు.

## అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు

**సింధూరదర్శిని:** జులై 3న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. యాత్రను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు ప్రయత్నించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో యాత్ర మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నిఘావర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నిఘా సంస్థలు గుర్తించిన సమాచారం ప్రకారం.. జమ్మూకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరిపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించేయత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈహెచ్చరికల నేపథ్యంలో యాత్రమార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తు న్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికా రులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు అధికా రిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మొద్దని భద్రతావర్గాలు సూచిస్తున్నారు.

## వికసిత భారత్ లక్ష్య సాధనలో యువతదే కీలక పాత్ర

(మొదటిపేజీ తరువాయి)

ఎదగాలని ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి, వనాధికారాల కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన బాధ్యత ఇలాంటి సంస్థలపై ఉందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో ఈ విశ్వవిద్యాలయం గిరిజన యువత సర్వతోముఖాభివృద్ధికే కాకుండా, ఈ ప్రాంత సమగ్ర వికాసానికి కూడా గణనీయమైన కృషి చేస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు.

ప్రియమైన విద్యార్థులారా, ఈ స్నాతకోత్సవం మీ జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టం. ఇది సంతోషించుకునే రోజే అయినా, భవిష్యత్తుపై సంకల్పం తీసుకోవడానికి కూడా ప్రేరణనిస్తుంది. వేగంగా మారుతున్న ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే యువత నూతన నైపుణ్యాలను నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. పుస్తక పరిజ్ఞానంతో పాటు, మీ పరిసరాల నుంచి నేర్చుకుంటూ, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. తమ సంస్కృతి, సంప్రదాయాలతో అనుబంధం కొనసాగిస్తూనే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాలని అన్నారు.

అటవీ ఉత్పత్తులు, హస్తకళలు, చిరుధాన్యాలు, ఔషధ మొక్కలు, ఎకో-టూరిజం, స్థానిక నైపుణ్యాలను ప్రోత్సహించేలా గిరిజన విశ్వవిద్యాలయాల్లో నూతన ఆవిష్కరణలు జరగాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ఉత్తరాంధ్ర గిరిజన తెగల సాధికారత కోసం ఈ వర్సిటీ 'సైన్స్ అండ్ టెక్నాలజీ హబ్'ను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. గిరిజన సంక్షేమం, ప్రజారోగ్యం, వాతావరణ మార్పులు, ఆహార భద్రత, ఇంధన పరిరక్షణ వంటి అంశాలపై ఈ విశ్వవిద్యాలయం దృష్టి సారించిందని తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమ సమాజంతో కూడిన వికసిత భారత్ నిర్మాణంలో ఈ అంశాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు.

# మరింత పటిష్టంగా సమాచార నెట్వర్క్

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. భౌగోళికంగా కవరేజి లేని ప్రాంతాల వివరాలను ఇస్తామని స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో ఫైబర్ ద్వారా సమాచార నెట్వర్క్ ను ఏర్పాటు చేస్తున్నామని ఎక్కడా తవ్వకాలు జరక్కుండా ప్రతీ ఇంటికీ ఫైబర్ నెట్వర్క్ అందిస్తామన్నారు. ఏపీ వ్యాప్తంగా 1,69,638 కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్ నెట్వర్క్ తో పాటు 28.67 లక్షల బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు ఉన్నాయని అధికారులు తెలిపారు.

**డిజిటల్ లిటరసీకి సహకారం**

రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ వినియోగదారుల్లో డిజిటల్ లిటరసీకి కూడా సర్వీసు ప్రొవైడర్లు సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్సు మనమిత్ర ద్వారా అందిస్తున్న వివిధ సేవలు, సంజీవని పథకం సహా వివిధ టచ్ పాయింట్ల సేవల్ని సమర్థంగా వినియోగించుకునేలా ఈ డిజిటల్ లిటరసీ ఉపకరిస్తుందన్నారు. ప్రజలను డిజిటల్ లిటరేట్లుగా మారిస్తే మొబైల్ ఫోన్ ద్వారా ఎక్కువ సేవలు అందించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. త్వరలో ఏఐ ఆగ్రానమిస్ట్, ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్ లాంటి వేర్వేరు సేవల్ని వినియోగదారులు ఉపయోగించుకునేందుకు అవకాశం ఉందని వివరించారు. కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాతిపదికన అన్ని ప్రాంతాలకూ పూర్తి మొబైల్ కవరేజి అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సమీక్షకు ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ , బీఎస్ఎన్ఎల్, ఎయిర్ టెల్, జియో, వోడా ఫోన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

# ఏపీలో విద్యా సంస్కరణలు భేష్

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేస్తున్న ఆధునిక విద్యాబోధన పద్ధతులు, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి. పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. విద్యార్థులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మంత్రులు పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగారు.



**టెక్నాలజీ, సంప్రదాయాల మేళవింపు**

పర్యటనలో భాగంగా, విద్యాబోధనలో వినియోగిస్తున్న పలు ఆధునిక ఉపకరణాలను మంత్రులు పరిశీలించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం రూపొందించిన 'జాదూ పిటారా' కిట్‌ను కేంద్ర మంత్రి ఆసక్తిగా గమనించగా, దాని పనితీరును మంత్రి లోకేశ్, సిబ్బంది వివరించారు. విద్యార్థుల ప్రగతిని నమోదు చేసే ప్రోగ్రెస్ కార్డులు, అసెస్‌మెంట్ బుక్‌లెట్లను లోకేశ్ కేంద్ర మంత్రికి చూపించారు. విలువలతో కూడిన విద్య కోసం ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలతో ముద్రించిన పుస్తకాల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్'లోని టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫాం, షూ, స్కూల్ బ్యాగ్ వంటి వస్తువులను ప్రధాన్ పరిశీలించారు.

**లీప్ డ్యాష్‌బోర్డుపై ప్రత్యేక ఆసక్తి**

రాష్ట్ర విద్యాశాఖ పనితీరును పర్యవేక్షించేందుకు రూపొందించిన 'లీప్' డ్యాష్‌బోర్డును కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆసక్తిగా తిలకించారు. ఈ డ్యాష్‌బోర్డు ద్వారా విద్యార్థుల నమోదు, హాజరు, అభ్యసన ఫలితాలు, మధ్యాహ్న భోజన పథకం, డ్రాపౌట్లు, అధికారుల తనిఖీలు వంటి అనేక అంశాలను రియల్ టైంలో పర్యవేక్షించవచ్చని మంత్రి లోకేశ్ వివరించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న స్మార్ట్ కిచెన్ల వ్యవస్థపై రూపొందించిన వీడియోను మంత్రులు వీక్షించారు. కడపలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన స్మార్ట్ కిచెన్ గురించి కేంద్ర మంత్రికి లోకేశ్ విశదీకరించారు. అనంతరం స్పోర్ట్స్ రూమ్, స్కిల్ ల్యాబ్‌లను సందర్శించి, అక్కడ విద్యార్థులు పైథాన్ లాంగ్వేజ్‌తో రూపొందించిన ఒక అప్లికేషన్‌ను పరిశీలించి అభినందించారు.

**విద్యార్థులతో సరదాగా ముచ్చట్లు**

అనంతరం మంత్రులిద్దరూ 9వ తరగతి గదికి వెళ్లి విద్యార్థుల మధ్య కూర్చున్నారు. 'ఫిజియోగ్రాఫిక్ డివిజన్ ఆఫ్ ఇండియా' అనే పాఠ్యాంశంపై రూపొందించిన క్లిక్కర్ వీడియోను వీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి విద్యార్థులతో సరదాగా సంభాషించారు. చాణక్య అనే విద్యార్థిని "చాణక్యుడు కింగా? కింగ్ మేకరా?" అని ప్రశ్నించగా, ఆ విద్యార్థి 'కింగ్ మేకర్' అని చురుగ్గా సమాధానమిచ్చాడు. మరో విద్యార్థిని పాఠ్యాంశాల్లో సందేహాలు వస్తే ఎవరిని అడుగుతావని ప్రశ్నించగా, తన సోదరుడిని అడుగుతానని చెప్పాడు. ఈ నేపథ్యంలో, విద్యార్థుల సౌలభ్యం కోసం బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్‌ను ప్రవేశపెట్టామని మంత్రి లోకేశ్ వివరించారు. విద్యార్థి స్థాయి ఆధారంగా బోధించే 'పాల్' ల్యాబ్‌ను కూడా మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా తమ పేర్లతో 3డీ ప్రింటింగ్‌తో రూపొందించిన బహుమతులను ఓ విద్యార్థి మంత్రులకు అందజేశాడు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకట్రావు, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు, ఇతర ఉన్నతాధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ పక్కగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

బాపట్ల సింధూరదర్శిని:

ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం గ్రామంలో కలెక్టర్ మంగళవారం పర్యటించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా సర్వేలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002 ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాకు మ్యాపింగ్ చేస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ సమర్థంగా చేపట్టాలన్నారు. కొండూరి పోతురాజు నివాసానికి చేరుకుని క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ప్రస్తుతం జాబితాలో ఉన్న వారి వివరాలు, 23 ఏళ్ల క్రితం జాబితాలో ఉన్న వారిని అనుసంధానిస్తూ ఓటు మ్యాపింగ్ చేయించారు. పొట్టి సుబ్బయ్య పాలెంలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ తక్కువగా జరగడంపై



సంబంధిత బి ఎల్ ఓ ను నిలదీశారు. మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా చేపట్టాలని, నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లేకుంటే సంబంధిత బి ఎల్ ఓ, తహసిల్దార్ లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్డీఓ ఎస్.నరసింహారావు, తహసిల్దార్ పాల్గొన్నారు.

# యువత ఉపాధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మాచర్ల, సింధూరదర్శిని:

యువతకు 20లక్షల ఉద్యోగాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి యువ నాయకులు జూలకంటి గౌతమ్ రెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, కృష్ణవేణి విద్యాసంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక SVR డిగ్రీ కళాశాల నందు ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌ను పటిష్టమైన ఆర్థికవ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ అహర్నిశలు పాటుపడుతున్నారని చెప్పుకొచ్చారు. రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చి, యువత ఉపాధికి పెద్దపీట వేస్తున్నారని వివరించారు. ఎమ్మెల్యే జూలకంటి సారధ్యంలో మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని తెలిపారు. మల్టీ నేషనల్



కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, నియోజకవర్గ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మంచి ఉద్యోగాలు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి తమ్మాజీరావు, ప్లేస్మెంట్ అధికారి రామాంజనేయులు, రవీంద్ర నాయక్, కళాశాల ప్రిన్సిపల్ వెంకటరామయ్య, టిడిపి సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జున రావు, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, కంభంపాటి అనిల్‌కుమార్, శశిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం అభినందనీయం

## ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు (సింధూర దర్శిని) 30 జూన్ నెల్లూరు జిల్లా ; అల్లూరు ఆదిశేషా రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రతి ఏడాది క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కొనియాడారు. గూడూరు పట్టణంలోని స్టేడియంలో రోటరీ క్లబ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్ లో ఆయన పాల్గొని క్రీడలు ప్రారంభించారు. పట్టణంలోని అల్లూరు ఆదిశేషా రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గూడూరు రోటరీ క్లబ్ అధ్వర్యంలో అల్లూరు ఆదిశేషా రెడ్డి రోటరీ స్పోర్ట్స్ మీట్ ను ఏర్పాటు చేశారు. ఆదిశేషారెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్,సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. క్రీడా జెండాను ఎగురవేశారు. క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ.. అల్లూరు ఆదిశేషా రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రతి ఏడాది స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడల పట్ల ఆయనకు ఎంతో మక్కువ అని, తరచూ క్రీడలు నిర్వహించే వారని గుర్తు చేశారు.స్టేడియం అభివృద్ధికి ఆయన క్రుషి చేశారని వివరించారు. ఇంకా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు డాక్టర్ జనార్దన్ రెడ్డి, దశరథరామి రెడ్డి,మునిగిరీష్,బాలక్రిష్ణం రాజు, వేగూరు రాజేంద్ర ప్రసాద్,సురేష్ రెడ్డి,వెంకటేశ్వర్లు రెడ్డి పాల్గొన్నారు.

# పున్నపు వారిపాలెంకి ముఖ్యమంత్రి రాక

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల




నెల్లూరు ( సింధూర దర్శిని) 30 జూన్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు జిల్లా యన్.టి.ఆర్ భరోసా సామాజిక పెన్షన్ ల పంపిణీ కార్యక్రమము , జులై 1 వ తేదిన పించను పంపిణి జరుగునని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , చిల్లకూరు మండలములోని పున్నపువారిపాలెం గ్రామములో పాల్గొంటారని జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్ల వారు ఒక ప్రకటనలో తెలియ చేసారు. ఉదయం 6.30 గంటల నుండి పించన్ల పంపిణి యాప్ అందుబాటులో వుంటుంది అని, జిల్లాలో మొత్తం 2,86,663 పింఛనుదారులకు రు.126,24,39,500లను, ప్రతి పింఛనుదారుని ఇంటివద్దనే పింఛను పంపిణి చేయబడును అని ఇందుకు గాను 13265 క్లస్టర్ లలో 6593 మంది సిబ్బందిని సచివాలయ వారీగా విధులు నిర్వహించు విధముగా,అన్నీ ఏర్పాటులను చేయడమైనదని వి.నాగరాజకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ వారు తెలియచేసారు.

# ముని ప్రసాద్‌కు ఘనంగా పదవీ విరమణ సన్మానం

## సహాయక కమిషనర్ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి



బుచ్చిరెడ్డిపాలెం ( సింధూర దర్శిని) 30 జూన్ నెల్లూరు జిల్లా ; బుచ్చిరెడ్డిపాలెం జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం జొన్నవాడ క్షేత్రంలో ఆలయ సేవలో 33 సంవత్సరాల పాటు అటెండర్‌గా విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన కందికట్టు ముని ప్రసాద్ కి మంగళవారం దేవస్థాన ప్రాంగణంలో ఘనంగా పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది.కార్యక్రమానికి దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు ముంగర సుధాకర్ , ఆలయ అర్చకులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, మిత్రులు మరియు శ్రేయోభిలాషులు హాజరై ముని ప్రసాద్ ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలను అందజేసి ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ, ముని ప్రసాద్ మూడు దశాబ్దాలకు పైగా ఆలయ సేవలో క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో విధులు నిర్వర్తించి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. ఆలయ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.తన పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలు, ఆనందం, సుఖశాంతులతో కూడిన దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తూ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది, భక్తులు, కుటుంబ సభ్యులు, మిత్రులు మరియు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పవిత్ర క్షేత్రం బారాషాహీద్ దర్గా

**ప్రపంచంలోనే మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనం బారాషహీద్ దర్గా**

**మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**

**భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, సర్వమత సామరస్యానికి ప్రతీకగా నెల్లూరు రొట్టెల పండుగ**

**బారాషహీద్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి ఆనం**

నెల్లూరు( సింధూరదర్శిని) 30 జూన్ నెల్లూరు జిల్లా ; ప్రపంచంలోనే మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పవిత్ర క్షేత్రం బారాషహీద్ దర్గా అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మంగళవారం నెల్లూరులోని చారిత్రాత్మక బారాషహీద్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి బారాషహీదులను దర్శించుకుని దేశ ప్రజల సుఖ శాంతులు, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలోనే మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పవిత్ర క్షేత్రం బారాషహీద్ దర్గా అని పేర్కొన్నారు. భిన్న మతాలు, భిన్న సంప్రదాయాలు, భిన్న సంస్కృతులు కలిగిన ప్రజలు ఒకే వేదికపై కలుసుకుని పరస్పర, సోదర భావాన్ని చాటుకునే అపూర్వ ఆధ్యాత్మిక ఉత్సవం రొట్టెల పండుగ అని అన్నారు.భారతదేశం వైవిధ్యంలో ఏకత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన దేశమని, ఆ గొప్ప సంస్కృతికి ప్రతిబింబమే నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ అని మంత్రి పేర్కొన్నారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు తదితర అన్ని మతాలకు చెందిన భక్తులు ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ఒకే చోట చేరి రొట్టెలను మార్చుకోవడం భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం కేవలం ఆధ్యాత్మిక విశ్వాసానికి మాత్రమే పరిమితం కాకుండా, సర్వమత సౌభ్రాతృత్వానికి, సామాజిక ఐక్యతకు, మానవ విలువలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. మతం ఏదైనా మనుషులందరూ ఒక్కటేనని, పరస్పర ప్రేమ, గౌరవం, సహజీవనమే భారతీయతకు మూల సూత్రమని ఈ పండుగ ప్రపంచానికి చాటి చెబుతోందని తెలిపారు.ప్రతి ఏటా దర్గాపై ప్రగాఢ విశ్వాసంతో, స్వర్ణాల చెరువులో జరిగే రొట్టెల పండుగలో పాల్గొనేందుకు లక్షలాది మంది భక్తులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తున్నారని చెప్పారు. గతంలో కొన్ని వేల మంది భక్తులతో ప్రారంభమైన ఈ ఉత్సవం నేడు లక్షలాది మంది పాల్గొనే మహోత్సవంగా రూపాంతరం చెందడం ఈ పండుగ విశిష్టతకు నిదర్శనమన్నారు.దివంగత ఆనం వివేకానంద రెడ్డి హయాం నుంచే బారాషహీద్ దర్గా అభివృద్ధికి తమ కుటుంబం కృషి చేస్తోందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎన్డీఏ కూటమి నాయకులు, జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో రొట్టెల పండుగ మరింత వైభవంగా నిర్వహించబడుతోందని పేర్కొన్నారు.ఈ గొప్ప సంప్రదాయం తరతరాల పాటు ఇలాగే కొనసాగుతూ మతసామరస్యానికి, జాతీయ ఐక్యతకు మార్గదర్శకంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ముస్లిం మత పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# భక్తుల కోర్కెలు తీర్చే పవిత్ర స్థలం బారా షహీద్ దర్గా



నెల్లూరు( సింధూర దర్శిని) 30 జూన్ నెల్లూరు జిల్లా ; రొట్టెల పండుగ ముగింపు వేడుకల్లో పాల్గొన్న శాసనసభ్యురాలు రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు అద్భుత ఏర్పాట్లు చేసిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఒ జిల్లా యంత్రాంగానికి అభినందనలు నెల్లూరు బారా షహీద్ దర్గాల ఐదు రోజుల రొట్టెల పండుగ మంగళవారం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నెల్లూరు జిల్లాలో ఉన్న బారా షహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగ ఎంతో పవిత్రమైన పండుగని కొనియాడారు. ఈ పండుగకు దేశ, విదేశాల నుంచి, అలాగే రాష్ట్రం నలుమూలల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని చెప్పారు. భక్తులు తమ కోరికలు నెరవేరితే, లేదా ఏవైనా కోరికలు ఉంటే ఇక్కడ రొట్టెలు వదలడం, పట్టుకోవడం చేస్తుంటారని తెలిపారు. ఈ సంప్రదాయంపై ఉన్న బలమైన నమ్మకం వల్లే ఏటా లక్షల మంది భక్తులు ఈ పండుగకు వస్తున్నారని, తాను కూడా గత 20 సంవత్సరాలుగా ఇక్కడికి వచ్చి ఆశీస్సులు పొందుతున్నానని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గుర్తుచేసుకున్నారు. పండుగకు భారీగా తరలివచ్చే భక్తులకు ఏ మాత్రం అసౌకర్యం కలగకుండా ఉండేలా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ , రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి , జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్ గారు, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, కోటం రెడ్డి గిరిధర్ రెడ్డి , అలాగే జిల్లా యంత్రాంగం, దర్గా కమిటీ సభ్యులు, సేవలు అందించిన అందరికీ ఆమె తన ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. ఏటా ఈ పండుగను ఇంకా ఘనంగా జరపాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇక్కడికి విచ్చేసిన భక్తులందరికీ అల్లా ఆశీస్సులు ఉండాలని, అందరి కుటుంబాలకు మంచి జరగాలని ఆమె ఆకాంక్షించారు. రొట్టెల పండుగ చివరి రోజున రాష్ట్రం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి, యువ నాయకులు నారా లోకేష్ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటూ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్ తో కలిసి తాను రొట్టెలు మార్చుకున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.

# ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు ( సింధూర దర్శిని) 30 జూన్ నెల్లూరు జిల్లా ; భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులకు సూచించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మంగళవారం నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో గల ఈవీఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన మూడు గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు ఈవీఎం గోడౌన్ల వద్ద అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. గోదాములలో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, సీల్స్, స్ట్రాంగ్ రూమ్ భద్రతతో పాటు గోదాము అంతర్గత పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు తీరుపై రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె విజయ్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రసూల్, శ్రీనివాస్, పి కోటేశ్వర్ రెడ్డి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నపాటి లోపాలకు కూడా తావు ఉండరాదు



**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**

**పటిష్ట బందోబస్తు నిర్వహణ**

**జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు**

ఓబులవారిపల్లె ( సింధూర దర్శిని ) 30 జూన్ తిరుపతి జిల్లా ; ఓబులవారిపల్లె మండలంలోని ముక్కా వారిపల్లి పంచాయతీ వద్ద జూలై 2న నిర్వహించనున్న వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ కార్యక్రమానికి సంబంధించిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి తదితరులు పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ముక్కవారి పల్లి సభా వేదిక నందు ఏర్పాటు చేసిన ముందస్తు భద్రతా శ్రేణి లైజన్ అధికారుల సమన్వయ సమావేశంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, రెడ్ శాండల్ ఎస్పి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు లతో కలిసి సమీక్ష నిర్వహించి ప్రముఖుల పర్యటనలో భాగంగా ముందస్తు ఏర్పాట్ల పై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలంలోని ముక్కవారిపల్లి పంచాయతీ వద్ద జూలై 2న నిర్వహించనున్న వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ కార్యక్రమానికి సంబంధించిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి తదితరులు తిరుపతి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ప్రముఖుల పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి, ఇతర వీవీఐపీల కోసం ప్రత్యేక గ్రీన్‌రూములను సిద్ధంగా ఉంచాలని, అనుమతి పొందిన వ్యక్తులు మాత్రమే వీవీఐపీల వెంట వెళ్లేలా కట్టుదిట్టమైన నియంత్రణ అమలు చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద స్వాగతానికి అనుమతి పొందిన వారు తమ విధులు పూర్తయిన వెంటనే వీఐపీ లాంజ్‌కు వెళ్లేలా చర్యలు తీసు కోవాలని, వీవీఐపీలతో కలిసి కార్యక్రమ ప్రాంగణమంతా తిరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు , పర్యటనల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ స్పెషలిస్ట్ డాక్టర్లను ఏర్పాటు చేయాలని, సేఫ్ రూమ్, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు, అవసరమైన రక్త గ్రూపులు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అగ్నిమాపక శాఖ ఫైర్ ఇంజిన్‌లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రముఖులకు అందించే ఆహారాన్ని నిబంధనల మేరకు పరీక్షించాలని ఆదేశించారు. ఏపీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కాన్వాయ్ వాహనాలు మంచి కండీషన్‌లో ఉండేలా ముందుగానే పరిశీలించాలని తెలిపారు. ప్రముఖులకు భోజన, త్రాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని ఎయిర్‌పోర్ట్ అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ అంశాలు, కేటాయించిన విధుల్లో అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు మాట్లాడుతూ పోలీస్ శాఖ తరపున బందోబస్తు కట్టుదిట్టంగా ఉండాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. వేదిక వెనుక కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ ద్వారా హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ప్రవేశ ద్వారాలు సహా అన్ని ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించా లని ఆదేశించారు. కమ్యూనికేషన్ వ్యవస్థ నిరంతరాయం గా పనిచేసేలా ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ సదుపాయాలు కూడా సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ఎం. రూపానంద రెడ్డి, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ , ఏఎస్పీ లు శ్రీనివాసరావు, కులశేఖర్, డిపి ఓ సుశీలా దేవి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, రవాణా అధికారి మురళి మోహన్, ఆర్ అండ్ బి ఎస్ ఈ రాజా నాయక్, సంబంధిత అధికారులు, కోడూరు ఇంచార్జి ఆర్ సి మునికృష్ణ, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి పర్యటనకు పోలీస్ శాఖ విస్తృత భద్రత ఏర్పాట్లు: జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల





గూడూరు( సింధూర దర్శిని) 30 జూన్ నెల్లూరు జిల్లా ; ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు , బందోబస్తు సిబ్బందికి జిల్లా ఎస్.పి. డా. అజిత వేజెండ్ల జులై 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు "పెన్షన్ పంపిణీ" పథకంలో భాగంగా చిల్లకూరు మండలంలోని పున్నపువారి పాలెం గ్రామంలో నిర్వహించనున్న పర్యటనను పురస్కరించుకొని జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి. డా. అజిత వేజెండ్ల బందోబస్తు విధుల్లో పాల్గొననున్న పోలీసు అధికారులు మరియు సిబ్బందికి సమగ్ర బ్రీఫింగ్ నిర్వహించారు. పర్యటనకు సంబంధించిన పూర్తి స్థాయి భద్రతా ఏర్పాట్లను వివరంగా తెలియజేస్తూ, ప్రతి ఒక్కరి బాధ్యతలను స్పష్టంగా వివరించారు.

జిల్లా ఎస్.పి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రాముఖ్యత కలిగినదని, అందుకు అనుగుణంగా ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండి తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన నియంత్రణలు అమలు చేయాలని ఆదేశించారు. వీవీఐపీ కాన్వాయ్ సురక్షిత ప్రయాణం కోసం, హెలిపాడ్ నుండి, ప్రజా వేదిక వరకు రూట్ బందోబస్తు, కీలక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపులు, వాహనాల పార్కింగ్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదనంగా బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సహకారంతో యాంటీ సబోటేజ్ చెకింగ్, రోడ్ ఓపెనింగ్ పార్టీ, కూంబింగ్ చర్యలను క్షుణ్ణంగా నిర్వహించాలని తెలిపారు. డ్యూటీకి హాజరయ్యే ప్రతి అధికారి, సిబ్బంది సమయపాలన పాటిస్తూ తమకు కేటాయించిన పాయింట్లలో పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని, విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, పూర్తి యూనిఫారంలో ఐడీ కార్డులతో విధులకు హాజరుకావాలని సూచించారు. అనంతరం బందోబస్త్ అధికారులుతో కాన్వయ్ ట్రయల్ రన్ నిర్వహించినారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మొత్తం 620 మంది అధికారులు మరియు పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్.పి. గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి. సి. హెచ్. సౌజన్య అడిషనల్ ఎస్.పి. శ్రీనివాస రావు , అడిషనల్ ఎస్. పి. పాపారావు డి.ఎస్.పీ. వెంకటేశ్వర , గూడూరు ఇంచార్జి డి.ఎస్.పి. గిరిధర్, ఘట్టమనేని శ్రీనివాస రావు, రమణ కుమార్, చంద్ర మోహన్, రమణ కుమార్ ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు సర్వం సిద్ధం

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**



గూడూరు (సింధూరదర్శిని) 30 జూన్ నెల్లూరు జిల్లా ; రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 1వ తేదీన చిల్లకూరు మండలం పున్నపు వారి పాలెం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా పేర్కొన్నారు. జులై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి గూడూరు నియోజకవర్గం పున్నపువారిపాలెం లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా రానున్న సందర్భంగా, మంగళవారం చిల్లకూరు మండలం, పున్నపువారి పాలెంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, జేసి మొగిలి వెంకటేశ్వర్లులతో కలసి ఏర్పాట్లపై కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్దంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు.. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులు పక్కాగా వుండాలని, అలాగే త్రాగు నీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులు పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్దంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నూతన పరిశ్రమలు రానున్నాయని తద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాల వారిని ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే అవకాశం ఉందని సుమారు 5000 నుంచి 7000 దాకా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. గూడూరు నియోజకవర్గంలో అధికసంఖ్యలో పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి ఫర్నిచర్, కృష్ణపట్నం పోర్టు సిటీ తదితరములపై ముఖ్యమంత్రి రివ్యూ చేయనున్నారని, అలాగే నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి నివేదికలు ముఖ్యమంత్రి కి సమర్పించనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో అరుణ కుమారి, ఆత్మకూరు ఆర్డీవో పావని, మెప్మా పిడీ, కిరణ్ కుమార్, డిపివో వసుమతి, తెలుగు గంగ ప్రత్యేక అధికారులు వంశీకృష్ణ,కేశవర్ధన్ రెడ్డి , తానంకి నానాజీ , తాసిల్దార్ లు గోపీనాథ్ రెడ్డి, ఆర్ వెంకట ప్రసాద్ , జేజేరావు , అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ రహిత మునిసిపాలిటీలే ప్రభుత్వ లక్ష్యం

**పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ**

**ప్రతి రోజూ ఉత్పత్తి అయ్యే చెత్తను అదే రోజు పూర్తిగా తరలించేలా చర్యలు**


**స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో మంత్రి నారాయణ సమీక్ష**



అమరావతి సింధూర దర్శిని: రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలను డంపింగ్ యార్డ్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. మునిసిపాలిటీల్లో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాలను అదే రోజు పూర్తిగా తరలించి శాస్త్రీయంగా ప్రాసెస్ చేసే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై మంగళవారం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు, రాష్ట్రంలోని మునిసిపల్ కమిషనర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సమావేశానికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యక్షంగా హాజరుకాగా, డైరెక్టర్ సంపత్ కుమార్, వివిధ మునిసిపాలిటీల కమిషనర్లు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. రాష్ట్రంలో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఇప్పటికే విశాఖపట్నం, గుంటూరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లకు పలు మునిసిపాలిటీల నుంచి చెత్తను తరలించి శాస్త్రీయంగా ప్రాసెస్ చేస్తున్నట్లు అధికారులు వివరించారు. మిగిలిన మునిసిపాలిటీల్లో ఉత్పత్తి అయ్యే తాజా చెత్తను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసేందుకు ప్రభుత్వం ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని సమావేశంలో వెల్లడించారు. ఈ ప్లాంట్ల నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణను వేగవంతం చేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించే చర్యలను తక్షణమే పూర్తి చేయాలని మునిసిపల్ కమిషనర్లకు సూచించారు. ప్రతి రోజు ఉత్పత్తి అయ్యే చెత్తను ఎలాంటి జాప్యం లేకుండా తరలించేందుకు అవసరమైన వాహనాల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఘన వ్యర్థాల నిర్వహణలో శాశ్వత పరిష్కారాలను అమలు చేయడం ద్వారా రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలను డంపింగ్ యార్డ్ రహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డాక్టర్ పి. నారాయణ తెలిపారు.

## ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాలు పూర్తి కాకపోవడం దురదృష్టకరం

### ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి




గూడూరు( సింధూర దర్శిని) 30 జూన్ నెల్లూరు జిల్లా ; 14 ఏళ్ల నిర్లక్ష్యం – పూర్తి చేస్తారా? కూల్చివేస్తారా? ప్రభుత్వం వెంటనే తేల్చాలి.మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు – పనబాక లక్ష్మి కృషి ఫలితం – 90% పూర్తయి 10% వద్దే నిలిచిపోయింది: ఏపీ సి సి ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

గూడూరు పట్టణంలోని రెండు ప్రధాన ప్రాంతాలను అనుసంధానించే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమై 14 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ఇప్పటికీ పూర్తి కాకపోవడం అత్యంత దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి అన్నారు.గూడూరు ప్రజలు రైల్వే గేటు కారణంగా ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను గుర్తించి, ఆనాటి కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పనబాక కృష్ణయ్య ప్రత్యేక చొరవతో ఈ ఫ్లైఓవర్ ప్రాజెక్టును సాధించారని ఆయన గుర్తు చేశారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 2009 ఎన్నికల మేనిఫెస్టోలో ఈ ప్రాజెక్టును చేర్చి, అవసరమైన నిధులను మంజూరు చేసి నిర్మాణ పనులను ప్రారంభించారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 90 శాతం నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ, అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు మిగిలిన కేవలం 10 శాతం పనులను కూడా పూర్తి చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శించాయని ఆయన విమర్శించారు. 2014 నుంచి నేటి వరకు ప్రాజెక్టు పూర్తికాకపోవడం గూడూరు ప్రజల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమై 14 సంవత్సరాలు గడిచిపోయిన నేపథ్యంలో, ఇంతకాలం నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన ఫ్లైఓవర్‌ను యథాతథంగా కొనసాగించడం ఎంతవరకు సురక్షితం అనే సందేహం సహజంగానే ప్రజల్లో వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ఉన్న నిర్మాణం భద్రతపై నిపుణులతో సమగ్ర సాంకేతిక అధ్యయనం నిర్వహించి, దానిని పూర్తి చేయడం సాధ్యమా లేదా కొత్త ఫ్లైఓవర్ నిర్మించడం అవసరమా అనే అంశంపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఆనాడు సుమారు 25 వేల జనాభా ఉన్న గూడూరు పట్టణం ప్రస్తుతం 1.25 లక్షల జనాభాకు చేరుకున్నప్పటికీ, పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ఫ్లైఓవర్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం అత్యవసరమని అన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసి, ప్రస్తుతం ఉన్న నిర్మాణం భద్రత, నిర్మాణ నాణ్యత, సాంకేతిక సాధ్యతపై సమగ్ర నివేదిక సిద్ధం చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ నివేదిక ఆధారంగా ప్రస్తుత ఫ్లైఓవర్‌ను పూర్తి చేస్తారా? లేక భద్రతా కారణాల దృష్ట్యా దానిని తొలగించి కొత్త నిర్మిస్తారా? అనే విషయంపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయాన్ని ప్రజలకు ప్రకటించాలని కోరారు. ప్రజల భద్రత, రాకపోకల సౌలభ్యం, గూడూరు పట్టణ భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యను అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ రామకృష్ణయ్య, సర్వేపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పూల చంద్ర శేఖర్, బిసి నాయకులు గుంటమడుగు సుబ్బారామరాజు, రావూరి బ్రహ్మయ్య, చిల్లకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిల్లకూరు వేమయ్య , సర్వేపల్లి నియోజకవర్గం పరిశీలకులు బల్ల హరి, యువజన కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్, సుమంత్, మురారి కృష్ణయ్య, మైనారిటీ నాయకులు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజాసింగ్‌కు నాంపల్లి ప్రత్యేక కోర్టులో భారీ ఊరట

### 2022లో మునావర్ ఫారూఖీ షోను వ్యతిరేకించిన రాజాసింగ్

### దేశవ్యాప్తంగా దుమారం రేపిన రాజాసింగ్ వీడియో

### మంగళ్‌హాట్ పీఎస్ లో కేసులు నమోదు

### కేసును పూర్తిగా కొట్టివేసిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు

సింధూరదర్శిని:గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు నుంచి భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును కోర్టు పూర్తిగా కొట్టివేస్తూ, రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తుది తీర్పునిచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది.

కేసు వివరాల్లోకి వెళితే... 2022 ఆగస్టులో హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ షో నిర్వహించడాన్ని రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఆయన యూట్యూబ్‌లో విడుదల చేసిన ఒక వీడియో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. రాజాసింగ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన మంగళ్‌హాట్ పోలీసులు ఆయనపై 153ఏ, 295ఏ, 505(2) తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2022 ఆగస్టు 23న పోలీసులు రాజాసింగ్‌ను అరెస్ట్ చేసినప్పటికీ, అరెస్ట్ ప్రక్రియలో సరైన నిబంధనలు (41ఏ సీఆర్‌పీసీ నోటీసు వంటివి) పాటించలేదంటూ స్థానిక కోర్టు రిమాండ్‌ను తిరస్కరించి, ఆయనను వెంటనే విడుదల చేసింది. అయితే, ఆ తర్వాత నగరంలో చోటుచేసుకున్న నిరసనలు, శాంతిభద్రతల సమస్యలను కారణాంగా చూపిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. దీంతో రాజాసింగ్ దాదాపు 77 రోజుల పాటు జైలులో గడపాల్సి వచ్చింది.

# చిన్నపాటి లోపాలకు కూడా తావు ఉండరాదు: కలెక్టర్

### పటిష్ట బందోబస్తు నిర్వహణ జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు

ఓబులవారిపల్లె ( సింధూర దర్శిని ) 30 జూన్ తిరుపతి జిల్లా; ఓబులవారిపల్లె మండలంలోని ముక్కా వారిపల్లి పంచాయతీ వద్ద జూలై 2న నిర్వహించనున్న వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ కార్యక్రమానికి సంబంధించిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్య మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి తదితరులు పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ముక్కవారిపల్లి సభా వేదిక నందు ఏర్పాటు చేసిన ముందస్తు భద్రతా శ్రేణి లైజన్ అధికారుల సమన్వయ సమావేశంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, రెడ్ శాండల్ ఎస్పి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు లతో కలిసి సమీక్ష నిర్వహించి ప్రముఖుల పర్యటనలో భాగంగా ముందస్తు ఏర్పాట్ల పై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలం లోని ముక్కవారిపల్లి పంచాయతీ వద్ద జూలై 2న నిర్వహించనున్న వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ కార్యక్రమానికి సంబంధించిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి తదితరులు తిరుపతి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ప్రముఖుల పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి, ఇతర వీవీఐపీల కోసం ప్రత్యేక గ్రీన్‌రూములను సిద్ధంగా ఉంచాలని, అనుమతి పొందిన వ్యక్తులు మాత్రమే వీవీఐపీల వెంట వెళ్లేలా కట్టుదిట్టమైన నియంత్రణ అమలు చేయాలని ఆదేశించారు.హెలిప్యాడ్ వద్ద స్వాగతానికి అనుమతి పొందిన వారు తమ విధులు పూర్తయిన వెంటనే వీఐపీ లాంజ్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, వీవీఐపీలతో కలిసి కార్యక్రమ ప్రాంగణ మంతా తిరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్రమంత్రులు, పర్యటనల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ స్పెషలిస్ట్ డాక్టర్లను ఏర్పాటు చేయాలని, సేఫ్ రూమ్, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు, అవసరమైన రక్త గ్రూపులు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అగ్నిమాపక శాఖ ఫైర్ ఇంజిన్‌లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రముఖులకు అందించే ఆహారాన్ని నిబంధనల మేరకు పరీక్షించాలని ఆదేశించారు. ఏపీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కాన్వాయ్ వాహనాలు మంచి కండీషన్‌లో ఉండేలా ముందుగానే పరిశీలించాలని తెలిపారు. ప్రముఖులకు భోజన, త్రాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని ఎయిర్‌పోర్ట్ అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ అంశాలు, కేటాయించిన విధుల్లో అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు మాట్లాడుతూ పోలీస్ శాఖ తరపున బందోబస్తు కట్టుదిట్టంగా ఉండాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేదిక వెనుక కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ ద్వారా హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ప్రవేశ ద్వారాలు సహా అన్ని ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కమ్యూనికేషన్ వ్యవస్థ నిరంతరాయంగా పనిచేసేలా ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ సదుపాయాలు కూడా సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ఎం. రూపానంద రెడ్డి, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ , ఏఎస్పీ లు శ్రీనివాసరావు, కులశేఖర్, డిపి ఓ సుశీలా దేవి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, రవాణా అధికారి మురళి మోహన్, ఆర్ అండ్ బి ఎస్ ఈ రాజా నాయక్, సంబంధిత అధికారులు, కోడూరు ఇంచార్జి ఆర్ సి మునికృష్ణ, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# కార్పొరేషన్ బలోపేతానికి సమిష్టి కృషి చేయాలి

### :ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్:

తాడేపల్లి సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అధ్యక్షతన మంగళవారం కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ పరిపాలన, ఆర్థిక నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలు, భవిష్యత్ కార్యాచరణ, కొత్త ప్రాజెక్టుల అమలు, ఆదాయ వృద్ధి, పారిశ్రామిక ప్రోత్సాహం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామికాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా కార్పొరేషన్ మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పారిశ్రామికవేత్తలకు అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కార్పొరేషన్ ఆర్థిక బలోపేతానికి ఆదాయ వనరులను పెంచడం అత్యంత అవసరమని పేర్కొన్న చైర్మన్, కార్పొరేషన్‌కు వివిధ సంస్థలు, పరిశ్రమలు, లబ్ధిదారులు మరియు ఇతర వర్గాల నుంచి రావాల్సిన బకాయిలను త్వరితగతిన వసూలు చేయడానికి ప్రత్యేకకార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి బకాయి కేసును విడివిడిగా సమీక్షించి, అవసరమైన చోట చట్టపరమైన చర్యలు తీసుకుంటూ వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బకాయిల వసూళ్లపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులపై నిర్లక్ష్యం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్పొరేషన్ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ సంస్థ ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.సమావేశంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమలకు కేటాయించిన భూముల స్థితిగతులు, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, కొత్త పారిశ్రామిక అవకాశాల



సృష్టి, పరిపాలనా సంస్కరణలు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి శాఖ తన పనితీరును మరింత మెరుగుపరుచుకుని నిర్ణీత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని చైర్మన్ సూచించారు.అదేవిధంగా, రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త దిశానిర్దేశం చేసే లక్ష్యంతో కార్పొరేషన్ ఆధ్వర్యంలో త్వరలో పలు పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు చైర్మన్ ప్రకటించారు.లి ఈ పైలట్ ప్రాజెక్టులు పారిశ్రామిక రంగంలో వినూత్న విధానాలకు శ్రీకారం చుడతాయని, కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల అమలుకు సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, నిర్ణీత గడువులోగా ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదేవిధంగా, కార్పొరేషన్ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు సాంకేతికత వినియోగాన్ని పెంచాలని, పరిపాలనా వ్యవస్థలో పారదర్శకతను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందిస్తూ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ఏపీఐడీసీ మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

సమావేశంలో సభ్యులు కార్పొరేషన్ అభివృద్ధికి సంబంధించిన పలు నిర్మాణాత్మక సూచనలు చేయగా, వాటిపై చర్చించి అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కార్పొరేషన్ ఆర్థిక స్వావలంబన, బకాయిల వసూళ్ల వేగవంతం, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం, పెట్టుబడుల ప్రోత్సాహం, పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ సమావేశంలో కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రఘునాద్, కార్పొరేషన్ డైరెక్టర్లు సందీప్,జలగం రామారావు, రమణయ్య, మల్హోత్రా,బాల భారతి, ఉన్నతాధికారులు మరియు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. సమావేశం ముగింపులో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కార్పొరేషన్ మరింత సమర్థవంతంగా సేవలందించేలా సమిష్టి కృషితో ముందుకు సాగాలని చైర్మన్ డేగల ప్రభాకర్ పిలుపునిచ్చారు.



## ఒక ఎముకతో మారిపోయిన చరిత్ర

డైనోసార్ల రహస్యం ఎలా బయటపడిందంటే!

1676లో ఇంగ్లాండ్‌లో భారీ శిలాజం వెలికితీత

తొలుత దాన్ని ఏనుగు ఎముకగా భావించిన వైనం

అప్పటికి ఇంకా లేని డైనోసార్ల భావన

తర్వాత అది మెగాలోసారస్ శిలాజమని తెలుసుకున్న వైనం

1824లో తొలి శాస్త్రీయ డైనోసార్‌గా గుర్తింపు

1842లో పుట్టిన 'డైనోసార్' అనే పదం

డైనోసార్ల గురించి ప్రపంచానికి స్పష్టమైన అవగాహన ఉంది. కానీ ఒకప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉండేది. భారీ శిలాజాలు దొరికినా అవి ఏ జీవికి చెందినవో శాస్త్రవేత్తలకు తెలియదు. అలాంటి ఆసక్తికర సంఘటనే 17వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో జరిగింది. తర్వాత అదే శిలాజం చరిత్రలో నమోదైన తొలి డైనోసార్ ఆనవాళ్లలో ఒకటిగా గుర్తింపు పొందింది.
1676లో ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్‌షైర్‌లో సున్నపురాయి గనిలో కార్మికులు భారీ కాలి ఎముకను వెలికితీశారు. ఈ శిలాజాన్ని ప్రకృతి శాస్త్రవేత్త రాబర్ట్ ప్లాట్ పరిశీలించి 1677లో తన పుస్తకంలో వివరించారు. అది చాలా పెద్ద జీవికి చెందినదని ఆయన గుర్తించినా, డైనోసార్ల గురించి అప్పటికి ఎవరికీ తెలియదు. ఆ కాలంలో, అంతరించిపోయిన జంతువుల భావనే లేదు. దేవుడు సృష్టించిన ప్రతి జీవి ఎక్కడో ఒకచోట ఇప్పటికీ ఉంటుందనే నమ్మకం ఉండేది. అందుకే ఆ ఎముక గుర్రం, ఎద్దు వంటి జంతువులది కాదని ప్లాట్ తేల్చారు. అది బైబిల్‌లో చెప్పిన రాక్షస మనిషిదో లేదా రోమన్ సామ్రాజ్య కాలంలో బ్రిటన్‌కు వచ్చిన భారీ ఏనుగుదో అయి ఉంటుందని భావించారు. అప్పటి జ్ఞానానికి అది సహజమైన అంచనానే. ఆ అసలు శిలాజం ఇప్పుడు అందుబాటులో లేదు. రాబర్ట్ ప్లాట్ గీసిన బొమ్మలు, రాసిన వివరాలే మిగిలాయి. అయితే చాలా సంవత్సరాల తర్వాత శిలాజాలపై శాస్త్రీయ అవగాహన పెరిగినప్పుడు ఆ చిత్రాలను మళ్లీ పరిశీలించిన నిపుణులు అది ఏనుగు ఎముక కాదని, భారీ మాంసాహార డైనోసార్‌కు చెందినదని గుర్తించారు. 1824లో భూగర్భ శాస్త్రవేత్త విలియమ్ బక్లాండ్ అదే తరహా శిలాజాల ఆధారంగా ఆ జీవికి మెగాలోసారస్ అనే శాస్త్రీయ నామం పెట్టారు. శాస్త్రీయంగా పేరు పొందిన తొలి డైనోసార్‌గా ఇది చరిత్రలో నిలిచింది. ఆ తర్వాత 1842లో మరో శాస్త్రవేత్త రిచర్డ్ ఓవెన్ ఈ తరహా ప్రాచీన సరీసృపాలకు 'డైనోసోరియా' అనే పేరు పెట్టడంతో 'డైనోసార్' అనే పదం ప్రపంచానికి పరిచయమైంది. ఒకప్పుడు ఏనుగు ఎముకగా భావించిన శిలాజమే, తర్వాత డైనోసార్ల ఉనికిని నిరూపించే కీలక ఆధారంగా మారింది. శాస్త్ర విజ్ఞానం కాలానుగుణంగా ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పే గొప్ప ఉదాహరణగా ఈ సంఘటన ఇప్పటికీ నిలిచిపోయింది.

## తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు: హరీశ్‌రావు

సిగాచి పరిశ్రమలో 54 మంది కార్మికులు సజీవదహనమైన ఘటనను గుర్తు చేసుకున్న హరీశ్

20 కిలోమీటర్ల దూరంలో ఉన్నా రేవంత్ రెడ్డి రాలేదని విమర్శ

మృతి చెందిన కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దని వ్యాఖ్య



హైదరాబాద్, సింధూరదర్శిని: తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో కూలి కోసం వలస వచ్చిన 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘోర ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం, సిగాచి యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ఘటన జరిగిన రోజున హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ఉన్నా 20 కి.మీ దూరంలోని ఘటన స్థలానికి సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవకపోవడం హృదయవిదారకమన్నారు. విమర్శలు రావడంతో మరుసటి రోజు వచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఇస్తానని ప్రకటించినా, ప్రభుత్వం తరపున కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్స్యూరెన్స్, వైద్య ఖర్చులను కూడా పరిహారంలో చేర్చి మోసం చేశారని ఆరోపించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, క్షతగాత్రులకు సహాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన సామూహిక హత్య అని, 818 న్లూకి అనుమతి తీసుకుని 1777 న్లూ నడపడం, సేఫ్టీ గార్డ్స్, ఫైర్ చీూజ, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు విచారణలో తేలాయన్నారు. ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం, ఎండీని అరెస్టు చేసి వెంటనే బెయిల్‌పై విడుదల చేయడం లోపాయికారీ ఒప్పందాన్ని సూచిస్తుందని విమర్శించారు. సిగాచి డైరెక్టర్ల ఆస్తులను అటాచ్ చేసి కోటి రూపాయల పరిహారం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. "మాట తప్పడం మీకు అలవాటే కానీ, ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దు" అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

# ఏదైనా తిని వ్యాయామం చేయాలా?

ఖాళీ కడుపుతో చేయాలా? నిపుణుల సమాధానం ఇదే! - ఖాళీ కడుపుతో వ్యాయామం అందరికీ సరిపోదంటున్న నిపుణులు

తక్కువ తీవ్రత వ్యాయామానికి అయితే కొంత ప్రయోజనం - కఠిన వ్యాయామానికి ముందే శక్తి అవసరమన్న ఎక్స్‌పర్ట్స్

వ్యాయామానికి 30-60 నిమిషాల ముందు తినాలి - కార్బ్స్, కొద్దిపాటి ప్రోటీన్ ఉత్తమం - ఎక్కువ నూనె, పీచు ఉన్న ఆహారం వద్దు



ఫిట్‌గా ఉండాలంటే వ్యాయామం ఒక్కటే సరిపోదు. సరైన ఆహారం కూడా అంతే కీలకం. చాలామంది ఉదయం ఏమీ తినకుండా నేరుగా జిమ్‌కు వెళ్లడం లేదా పరుగులు తీయడం చేస్తుంటారు. ఇది కొందరికి ఉపయోగపడినా, అందరికీ మంచిదికాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం చేసే విధానం, తీవ్రత, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆహారపు అలవాట్లు ఉండాలని సూచిస్తున్నారు. ఖాళీ కడుపుతో చేసే వ్యాయామాన్ని 'ఫాస్టెడ్ వర్కౌట్' అంటారు. తక్కువ తీవ్రతతో చేసే నడక, తేలికపాటి కార్డియో వంటి వ్యాయామాల్లో ఇది కొంతమేర కొవ్వు కరిగేందుకు సాయపడొచ్చు. అయితే అధిక తీవ్రతతో చేసే వ్యాయామాలు, వెయిట్ ట్రైనింగ్, ఎక్కువసేపు కొనసాగే వర్కౌట్లకు శరీరానికి ముందే శక్తి అవసరం. అలాంటి సమయంలో ఏమీ తినకుండా వ్యాయామం చేస్తే త్వరగా అలసట వస్తుంది. పనితీరు తగ్గుతుంది. కొందరికి తల తిరగడం, బలహీనంగా అనిపించడం కూడా జరగొచ్చు. కండరాలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

వ్యాయామానికి 30 నుంచి 60 నిమిషాల ముందు తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. కార్బోహైడ్రేట్లు శరీరానికి వెంటనే శక్తిని అందిస్తాయి. కొద్దిపాటి ప్రొటీన్ కండరాల సంరక్షణకు ఉపయోగపడుతుంది. అయితే ఎక్కువ నూనె, కొవ్వులు, అధిక పీచు ఉన్న ఆహారం తీసుకుంటే జీర్ణక్రియ నెమ్మదించి వ్యాయామం సమయంలో అసౌకర్యం కలిగించే అవకాశం ఉంది. వ్యాయామానికి ముందు ఓట్స్‌తో ప్రొటీన్ పౌడర్, గోధుమ బ్రెడ్‌తో గుడ్లు, పెరుగు, కాల్చిన మఖానా, స్మూతీ, కొద్దిపాటి డ్రైఫ్రూట్స్, అరటిపండు వంటి ఆహారాలు మంచి ఫలితాలిస్తాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించడంతో పాటు త్వరగా అలసిపోకుండా సాయపడతాయి. అంతేకాదు, వ్యాయామానికి ముందు, మధ్యలో, తర్వాత తగినంత నీరు తాగడం కూడా చాలా ముఖ్యం. శరీరంలో నీటి కొరత ఏర్పడితే పనితీరు తగ్గడంతో పాటు త్వరగా అలసట వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే వ్యాయామంతో పాటు సరైన ఆహారం, తగినంత నీరు తీసుకోవడం ఆరోగ్యకరమైన ఫిట్‌నెస్‌కు కీలకమని నిపుణులు చెబుతున్నారు.

# భారత్‌కు తీవ్ర నీటి ముప్పు..

అదే సమయంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశం!

2030 నాటికి అందుబాటులో ఉన్న నీటి సరఫరాకు రెట్టింపు డిమాండ్

నీటి రంగంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడి అవకాశాలున్నాయని అంచనా

పీఎల్ క్యాపిటల్ నివేదికలో వెల్లడైన కీలక వాస్తవాలు

మురుగునీటి శుద్ధి రంగంలోనే అతిపెద్ద అవకాశాలున్నాయని వెల్లడి

'జల్ జీవన్ మిషన్', 'నమామి గంగే' వంటి పథకాలతో ప్రభుత్వ చర్యలు



భారతదేశం రానున్న రోజుల్లో తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కోబోతోందా? ఈ ప్రశ్నకు సమాధానంగా... 2030 నాటికి దేశంలో అందుబాటులో ఉన్న నీటి సరఫరా కంటే డిమాండ్ రెట్టింపు స్థాయికి చేరుకుంటుందని ఒక నివేదిక హెచ్చరించింది. అయితే, ఈ సంక్షోభమే రాబోయే దశాబ్దంలో సుమారు రూ.20 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి అవకాశాలకు మార్గం సుగమం చేయనుందని పీఎల్ క్యాపిటల్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా జల శుద్ధి (వాటర్ ట్రీట్‌మెంట్), మురుగునీటి రీసైక్లింగ్, మురుగునీటి పారుదల మౌలిక సదుపాయాల రంగాల్లో ఈ అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.
ప్రపంచ జనాభాలో దాదాపు 18 శాతం వాటా ఉన్న భారత్‌లో, ప్రపంచంలోని మంచినీటి వనరుల్లో కేవలం 4 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వేగవంతమైన పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, భూగర్భ జలాల క్షీణత, వ్యవసాయానికి నీటి వినియోగం పెరగడం వంటి కారణాలతో నీటి కొరత తీవ్రమవుతోంది. ఈ పరిస్థితుల్లో నీటి భద్రత అనేది దేశానికి అత్యంత కీలకమైన అంశంగా మారిందని, దీనికోసం జల శుద్ధి, రీసైక్లింగ్, పంపిణీ, నిల్వ వ్యవస్థలపై భారీగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందని నివేదిక నొక్కి చెప్పింది.
"ఇతర మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు ఆర్థిక అంశాలతో ముడిపడి ఉండవచ్చు. కానీ, నీటి భద్రతకు సంబంధించిన పెట్టుబడులు నిర్మాణాత్మకమైనవి, విధానపరమైనవి, దేశ సుస్థిర అభివృద్ధికి ఇవి తప్పనిసరి" అని పీఎల్ క్యాపిటల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ విక్రమ్ కసత్ వివరించారు. పట్టణీకరణ, పారిశ్రామిక వృద్ధి, పర్యావరణ ప్రమాణాలు పెరగడం వల్ల నీటి శుద్ధి, పునర్వినియోగం, డీశాలినేషన్ వంటి రంగాలకు దీర్ఘకాలికంగా ఉంటుందని ఆయన తెలిపారు.
మురుగునీటి శుద్ధి రంగంలోనే అతిపెద్ద అవకాశాలు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా రోజుకు 72,000మిలియన్ లీటర్లకు పైగా మురుగునీరు ఉత్పత్తి అవుతుండగా, దానిని శుద్ధి చేసే సామర్థ్యం చాలా తక్కువగా ఉంది. శుద్ధి చేయని నీరు నేరుగా పర్యావరణంలోకి విడుదల కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈమౌలిక సదుపాయాల లోటును పూడ్చేందుకు మురుగు నీటి శుద్ధి, పునర్వినియోగ ప్రాజెక్టులపై పెట్టు బడులు వెల్లువెత్తే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 'జల్ జీవన్ మిషన్', 'అమృత్ 2.0', 'నమామి గంగే' వంటి పథకాల ద్వారా స్వచ్ఛమైన నీటి లభ్యత, మెరుగైన మురుగునీటి వ్యవస్థల కోసం కేటాయింపులు పెంచింది. మరోవైపు డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్ వంటి కొత్త పరి శ్రమలకు అత్యంత స్వచ్ఛమైన నీరు అవసరం కానుండటంతో పారిశ్రామిక నీటి డిమాండ్ మరింత పెరగనుంది.

# సీఎం విజయ్ ఖాళీ చేసిన స్థానం నుంచి పోటీ.. క్లారిటీ ఇచ్చిన లారెన్స్

టీవీకే తరపున పోటీ వార్తలను ఖండించిన లారెన్స్

ప్రజాసేవే తన ప్రధాన లక్ష్యమన్న నటుడు

60 మంది పిల్లల బాధ్యతలు చూస్తున్నట్లు వెల్లడి

తల్లి సూచనతో వివరణ ఇచ్చినట్లు వెల్లడి

నిర్ణయం విజయ్‌దేనని స్పష్టీకరణ



తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ప్రచారానికి నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తెరదించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని పార్టీ తరఫున తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం నుంచి తాను పోటీ చేయబోతున్నానన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలు పెద్ద వివాదానికి దారితీయడంతో లారెన్స్ కొత్త వీడియో విడుదల చేశారు. తన మాటలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పారు. తన తల్లి, సన్నిహితులు, తన సేవా సంస్థ సభ్యుల సూచనతోనే ప్రజలకు వివరణ ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా గత 20 ఏళ్లుగా తాను ఆర్థికంగా, వైద్యపరంగా ఆదుకుంటున్న రాజగోపాల్ అనే దివ్యాంగుడిని పరిచయం చేశారు. అతడితో జరిగిన అనుభవాలను వివరించిన లారెన్స్, ఒకరికి సేవ చేయడమే ఎంత బాధ్యతతో కూడుకున్నదో చెప్పారు. ప్రస్తుతం దాదాపు 60 మంది పిల్లల విద్య, సంరక్షణ బాధ్యతలను కూడా తానే చూసుకుంటున్నానని వెల్లడించారు. కొన్ని రోజుల క్రితం తాను ఆదుకున్న పిల్లలంతా కలిసి ఫాదర్స్ డే సందర్భంగా తనను సత్కరించారని, అది జీవితంలో మరచిపోలేని క్షణమని చెప్పారు. ప్రజల ప్రేమ వల్లే ఈ స్థాయికి వచ్చానని, తనపై వస్తున్న విమర్శలు వ్యక్తిగతంగా ఎంతో బాధించాయని పేర్కొన్నారు. ఈ పరిణామాలతో తన తల్లి కూడా తీవ్ర ఆవేదనకు గురై, రాజకీయాలకు దూరంగా ఉండాలని కోరిందన్నారు. రాజకీయాల్లోకి రావాలా వద్దా అని ప్రజలనే అడిగానని, అందులో తప్పేముందని కూడా ప్రశ్నించారు. తనను ఈ స్థాయికి తీసుకొచ్చింది ప్రజలేనని, అందుకే వారి అభిప్రాయానికి విలువ ఇస్తానన్నారు. తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తానన్న ప్రచారాన్ని లారెన్స్ ఖండించారు. ఆ నిర్ణయం పూర్తిగా విజయ్ తీసుకోవాల్సిన విషయమని చెప్పారు. ఆ నియోజకవర్గంలో చాలా కాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు ఉన్నారని, వారి కష్టాన్ని పక్కనబెట్టి తాను ముందుకు రావాలని అనుకోవడం లేదన్నారు. ప్రస్తుతం 'బెంజ్', 'కాంచన 4' చిత్రాల షూటింగ్‌లో బిజీగా ఉన్నానని, త్వరలోనే తన రాజకీయ భవిష్యత్‌పై పూర్తి వివరాలు వెల్లడిస్తానని లారెన్స్ చెప్పారు.

# అప్పటివరకు వైభవ్ సూర్యవంశీకి వెయిటింగ్ తప్పకపోవచ్చు: పుజారా

- యువ సంచలనం వైభవ్‌కు భారత మాజీ క్రికెటర్ పుజారా కీలక సూచనలు
- ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో అతనికి వెంటనే అవకాశం రాకపోవచ్చని వ్యాఖ్య
- తొలి మూడు మ్యాచ్‌ల వరకు వైభవ్ వేచి ఉండాల్సి రావచ్చన్న మాజీ క్రికెటర్
- తన చుట్టూ ఉన్న హైప్‌ను పట్టించుకోకుండా ఆటపైనే దృష్టి పెట్టాలని హితవు
- అవకాశం వచ్చినప్పుడు ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడాలని సలహా



భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి టీమిండియా సీనియర్ ఆటగాడు, మాజీ బ్యాటర్ ఛటేశ్వర్ పుజారా విలువైన సలహాలు ఇచ్చాడు. రేపటి నుంచి ఇంగ్లండ్‌తో జరగబోయే టీ20 సిరీస్‌కు వైభవ్ ఎంపికైన నేపథ్యంలో అతని చుట్టూ పెరుగుతున్న ప్రచారం ఒక ఆటంకంగా మారకూడదని పుజారా హితవు పలికాడు. భారత జట్టు ప్రస్తుత టాప్ ఆర్డర్ చాలా స్థిరంగా ఉన్నందున, వైభవ్‌కు తుది జట్టులో వెంటనే చోటు దక్కడం కష్టమని అభిప్రాయపడ్డాడు. దీర్ఘకాలిక విజయం కోసం సహనం, సరైన సన్నద్ధత చాలా కీలకమని పుజారా చెప్పాడు.
ఈ పర్యటనకు ముందు పుజారా మాట్లాడుతూ.. "ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ చుట్టూ చాలా హైప్ ఉంది. ఒక యువ ఆటగాడిగా, తన గురించి బయట వస్తున్న మాటలను అస్సలు పట్టించుకోకూడదు. బయటి ప్రపంచం నుంచి వచ్చే శబ్దాలను పక్కనపెట్టి, కేవలం తన ఆటపైనే దృష్టి పెట్టాలి" అని సూచించాడు. ఇలాంటి సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉండటం చాలా ముఖ్యమని పేర్కొన్నాడు. జట్టు ఎంపిక గురించి పుజారా మాట్లాడుతూ "వైభవ్ మానసికంగా సిద్ధంగా ఉన్నప్పటికీ, జట్టులోకి ఎంపికవ్వడం వేరే విషయం. ఇంగ్లండ్ సిరీస్‌లో అతనికి వెంటనే అవకాశం వస్తుందని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే భారత జట్టు తమ టాప్–3ని మార్చడానికి ఇష్టపడదు. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వంటి నాణ్యమైన బ్యాటర్లు టీ20 ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించారు. కాబట్టి తొలి మూడు మ్యాచ్‌ల వరకు వైభవ్ వేచి ఉండాల్సి రావచ్చు" అని స్పష్టం చేశారు. ప్రతిభ ఉన్నంత మాత్రాన జట్టులో చోటు దక్కుతుందని చెప్పలేమని, సరైన సమయం కోసం ఎదురుచూడాలని అన్నాడు.
ఒకవేళ అవకాశం వస్తే ఎలా ఆడాలో కూడా పుజారా వివరించాడు. "అవకాశం వచ్చినప్పుడు అతను ప్రశాంతంగా, నిలకడగా ఉండటమే కీలకం. భారీ స్కోర్లు చేయాలనే ఒత్తిడిని తనపై తాను పెట్టుకోకూడదు. మైదానంలోకి వెళ్లి ఎలాంటి బెరుకు లేకుండా స్వేచ్ఛగా తన ఆటను తాను ఆడాలి" అని సలహా ఇచ్చాడు. అలాగే, ఇంగ్లండ్‌లోని పరిస్థితులు భిన్నంగా ఉంటాయని పుజారా హెచ్చరించాడు. "ఐపీఎల్‌లో అతను కనబరిచిన ప్రదర్శనను ఇంగ్లండ్ పరిస్థితుల్లో పునరావృతం చేయడం అంత సులభం కాదు. అందుకే అతను బాగా సిద్ధమవ్వాలి, అక్కడి వాతావరణానికి, పిచ్‌లకు అలవాటు పడాలి. ఒకసారి అవగాహన పెంచుకున్నాక, బంతిని చూసి దానికి తగ్గట్టు ఆడటమే ముఖ్యం. మిగతావన్నీ వాటంతట అవే సర్దుకుంటాయి" అని పుజారా పేర్కొన్నాడు.

# యూట్యూబ్ వీడియోలు చూసి ఇంట్లో కాన్పు చేసుకున్న మహిళ.. రక్తస్రావంతో మృతి

తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో విషాదం
తొలి కాన్పు సమయంలో సిజేరియన్ అయిన వైనం
రెండో కాన్పును ఇంట్లోనే ప్రయత్నించిన 32 ఏళ్ల మహిళ



సింధూరదర్శిని: తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో ఒక హృదయవిదారక ఘటన వెలుగు చూసింది. కేవలం యూట్యూబ్ వీడియోల సమాచారాన్ని నమ్మి, ఇంట్లోనే ప్రసవం చేసుకోవడానికి ప్రయత్నించిన 32 ఏళ్ల శశికళ అనే మహిళ తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోయింది. శశికళకు ఇది రెండో ప్రసవం. మొదటి కాన్పు సమయంలో ఆమెకు సిజేరియన్ అయింది. దాంతో అల్లోపతి వైద్యంపై ఒక రకమైన విరక్తి పెంచుకున్న ఆమె, ఈసారి ఎలాగైనా సహజ పద్ధతిలోనే ప్రసవం కావాలని గట్టిగా అనుకుంది. మళ్లీ సిజేరియన్ అవుతుందేమోనన్న భయంతో, ఈ కుటుంబం రెగ్యులర్ వైద్య పరీక్షలను, ప్రభుత్వ ఆరోగ్య కార్యకర్తల సూచనలను పూర్తిగా పక్కన పెట్టేసింది. యూట్యూబ్‌లో వచ్చే వీడియోలను చూసి ఇంట్లోనే కాన్పు చేసుకోవాలని నిర్ణయించుకుంది. చివరకు అనుకున్నట్టుగానే శశికళ ఇంట్లోనే ఒక ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిచ్చింది. కానీ, ఆ తర్వాతే అసలు సమస్య మొదలైంది. కాన్పు పూర్తయ్యాక ప్లజెంటా (మాయ)కు సంబంధించిన తీవ్రమైన సమస్యలు తలెత్తడం, విపరీతంగా రక్తస్రావం అవ్వడంతో ఆమె పరిస్థితి విషమించింది. కంగారుపడిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను పెరుందురైలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినప్పటికీ... అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో వైద్యులు ఆమెను కాపాడలేకపోయారు. ప్రస్తుతం ఆ నవజాత శిశువు సురక్షితంగానే ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల నుండి ఎలాంటి ఫిర్యాదు అందకపోయినప్పటికీ, పోలీసులు సుమోటోగా స్పందించి శశికళ భర్త కొలంతైసామిపై కేసు నమోదు చేశారు. సరియైన అవగాహన లేని ఆన్‌లైన్ ఆరోగ్య చిట్కాలు, సలహాలు నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ప్రసవ సమయాల్లో కచ్చితంగా నిపుణులైన వైద్యుల పర్యవేక్షణ అవసరమని ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# విజయవాడ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
రెండు లారీల మధ్య నలిగిపోయి నుజ్జునుజ్జయిన కారు
ఓ స్కూటరిస్టుకు కూడా ప్రమాదం
ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి, ఒకరి పరిస్థితి విషమం
అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
ఘటనాస్థలిలో భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్



విజయవాడ, సింధూరదర్శిని: ఉమ్మడి కృష్ణా జిల్లాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గన్నవరం సమీపంలోని బి.బి. గూడెం వద్ద కొత్త జాతీయ రహదారి (విజయవాడ వెస్ట్ బైపాస్)పై ఒకేసారి పలు వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దురదృష్టకర సంఘటన మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే, విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళుతున్న ఓ కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ లారీని బలంగా గుద్దుకుంది. రెండు లారీల మధ్య కారు పూర్తిగా నలిగిపోయి నుజ్జునుజ్జయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న తల్లి, బిడ్డ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది. కారులో ఉన్న మరో వ్యక్తి ఈ ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయి, తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. అదే సమయంలో, రోడ్డుపై వేగంగా వచ్చిన ఓ స్కూటరిస్ట్ కూడా ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అదుపుతప్పిన ఆయిల్ ట్యాంకర్ లారీ... స్కూటరిస్టును ఢీకొట్టింది. దాంతో అతడు అక్కడిక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న గన్నవరం పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు క్రేన్ల సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. మృతదేహాలను, క్షతగాత్రుడిని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# టీ20 వరల్డ్ కప్ నుంచి మన మహిళల జట్టు నిష్క్రమించడంపై గవాస్కర్ కీలక వ్యాఖ్యలు

ఆస్ట్రేలియాతో ఓడిపోయిన టీమిండియా మహిళల జట్టు
సౌతాఫ్రికాతో ఓటమే టోర్నమెంట్ నుంచి నిష్క్రమించడానికి ప్రధాన కారణమన్న గవాస్కర్
జట్టులో ఫిట్‌నెస్ లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వెల్లడి

భారత మహిళా క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించడంపై క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఆస్ట్రేలియా లాంటి బలమైన జట్టుపై ఓడిపోవడం పెద్ద ఆశ్చర్యం కలిగించకపోయినా, అసలు మన అమ్మాయిలు సెమీఫైనల్ చేరకుండా టోర్నమెంట్ నుండి దాదాపు నిష్క్రమించడానికి అంతకంటే ముందు సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లే ప్రధాన కారణమని విశ్లేషించాడు. ఆ మ్యాచ్‌లో గెలిచే స్థితిలో ఉండి కూడా, అత్యంత పేలవమైన ఫీల్డింగ్ కారణంగా చేజేతులా మ్యాచ్‌ను ప్రత్యర్థికి అప్పగించేశారని మండిపడ్డాడు.
సౌతాఫ్రికా మ్యాచ్‌లో జరిగిన ఆ తప్పుతో పాటు, భారత మహిళా జట్టులో ఫిట్‌నెస్ లోపాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. మైదానంలో కొందరు ప్లేయర్లు వేళ్లకు బ్యాండేజీలతో ఆడటం చూస్తుంటే, వారు నూటికి నూరు శాతం ఫిట్‌నెస్‌తో లేరనే అనుమానం కలుగుతోందన్నాడు. జట్టును ఒంటిచేత్తో గెలిపించగల మ్యాచ్ విన్నర్లు అయితే గాయాలతో ఉన్నా ఆడించడంలో ఒక అర్థం ఉంటుంది కానీ, మిగతా వారి విషయంలో కూడా అదే పంథా కొనసాగించడం సరైనది కాదన్నాడు. ఒకవేళ గాయపడిన ప్లేయర్లనే నమ్ముకుంటే, బెంచ్ మీద ఉన్న రిజర్వ్ ఆటగాళ్లు అంతకంటే మెరుగ్గా ఆడలేరని మేనేజ్‌మెంట్ భావిస్తోందా? అనే ప్రశ్నలను గవాస్కర్ లేవనెత్తాడు. దీనికి తోడు మైదానంలో వ్యూహాత్మక లోపాలు కూడా భారత జట్టు కొంపముంచాయని గవాస్కర్ ఎత్తి చూపాడు. ప్రత్యర్థి బ్యాటర్లు మన స్పిన్నర్లను టార్గెట్ చేస్తూ 'ఎక్స్‌ట్రా కవర్' దిశగా వరుసగా బౌండరీలు బాదుతున్నా, కెప్టెన్సీ పరంగా ఆ గ్యాప్‌ను కవర్ చేయడానికి ఎలాంటి ఫీల్డింగ్ మార్పులు చేయకపోవడం ఆశ్చర్యం కలిగించింద న్నాడు. అక్కడ కనీసం ఫీల్డర్‌ను ఉంచి ఉంటే, బ్యాటర్లు రిస్కీ షాట్స్ ఆడి వికెట్లు సమర్పించుకునే అవకాశం ఉండేదని, కానీ ఆ కనీస వ్యూహాన్ని కూడా అమలు చేయలేకపోవడం వల్లే మన మహిళా జట్టుకు ఈ పరాభవం ఎదురైందని గవాస్కర్ స్పష్టం చేశాడు.

# హీరో అవ్వాలనుకున్నాడు...

## తిలక్‌వర్మపై మాజీ క్రికెటర్ శ్రీకాంత్ ఘాటు విమర్శలు

-ఐర్లాండ్ చేతిలో టీ20 సిరీస్ కోల్పోయిన టీమిండియా
-తిలక్ వర్మ స్వార్థంతో ఆడాడన్న మాజీ క్రికెటర్ శ్రీకాంత్
-తానే గెలిపించి హీరో అవ్వాలని చూశాడని మండిపాటు



ఐర్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత జట్టు ఓటమిపై మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్‌లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ముఖ్యంగా వైస్ కెప్టెన్ తిలక్‌వర్మ ఆటతీరును తప్పుబడుతూ, అతను జట్టు కోసం కాకుండా కేవలం సొంతస్కోరు కోసమే ఆడాడని విమర్శించాడు. 155 పరుగుల లక్ష్య ఛేదనలో 19 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన దశలో వచ్చిన తిలక్.. 46 బంతుల్లో 55 పరుగులు మాత్రమే చేయడం టీ20 ఫార్మాట్‌కు ఏమాత్రం సరిపోదని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. తిలక్ కేవలం సింగిల్స్, డబుల్స్‌తో మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లి, తానే గెలిపించి 'హీరో' అవ్వాలని చూశాడని ఘాటుగా వ్యాఖ్యానించాడు. జెర్సీ ఎత్తి సెలబ్రేట్ చేసుకోవాలనే ఆలోచనే తప్ప, మ్యాచ్‌ను ముందే ముగించాలనే ప్రణాళిక అతనికి లేదన్నాడు. దూబే, అక్షర్ పటేల్ కూడా స్ట్రైక్ రేట్ పెంచడంలో విఫలమయ్యారని మండిపడ్డాడు. భారత ఇన్నింగ్స్ మధ్యలో వరుసగా 45 బంతుల పాటు ఒక్క బౌండరీ కూడా రాకపోవడం అత్యంత అవమానకరమని శ్రీకాంత్ అన్నాడు. ఐర్లాండ్ వంటి సాధారణ బౌలింగ్ అటాక్ ముందు ఇలా ఆడటం వల్లే భారత్ 1 పరుగు తేడాతో ఓడిపోవడమే కాకుండా, ఐర్లాండ్ చేతిలో మొదటిసారి టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్‌ను ఎదుర్కోవాల్సి వచ్చిందని శ్రీకాంత్ స్పష్టం చేశాడు.

# పారిశుద్ధ్యమే ప్రాధాన్యం..

## ఓటరు జాబితా సవరణలో అలసత్వం వద్దు.

తెనాలి, సింధూరదర్శిని: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని, సవివర ఓటరు జాబితా సవరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రామా అప్పలనాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని 4వ వార్డు నందులపేట, బీసీ కాలనీలో కమిషనర్ పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వీధులు, కాలువలు, చెత్త సేకరణ తీరును తనిఖీ చేసి శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా చెత్త పేరుకు పోకుండా, కాలువల్లో మురుగు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. అనంతరం సవివర ఓటరు జాబితా సవరణ, ఓటరు మ్యాపింగ్ కార్యక్రమంపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత బీఎల్‌ఓలకు అందజేసి, వాటిని సకాలంలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# సినిమా న్యూస్

## 'బ్రేక్ ఫాస్ట్' మూవీ రివ్యూ!



రానవ్ - రోస్మిన్ ప్రధానమైన పాత్రలను పోషించిన తమిళ సినిమానే 'బ్రేక్ ఫాస్ట్'. గిరిజా వరదరాజ్ నిర్మించిన ఈ సినిమాకి, గాంధీకృష్ణ దర్శకత్వం వహించాడు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, ఏప్రిల్ 24వ తేదీన థియేటర్లకు వచ్చింది. సంపత్ రాజ్ - అర్చన కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఈ నెల 24వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు .. కన్నడ భాషల్లో ఈ సినిమా అందుబాటులో ఉంది. శంతను (రానవ్) ఇంజనీరింగ్ పూర్తి చేసి, మలేసియాలో కొంతకాలం పాటు జాబ్ చేస్తాడు. ఆ తరువాత కొన్ని కారణాల వలన అతను అక్కడి నుంచి వచ్చేయవలసి వస్తుంది. అయితే తాను మలేసియాలో ఉన్నట్టుగానే తల్లిదండ్రులను నమ్మిస్తూ, వాళ్ల అవసరాలను తీరుస్తుంటాడు. తండ్రి ట్రీట్మెంట్ కి తగిన డబ్బును పంపిస్తూ ఉంటాడు. తన సర్టిఫికెట్స్ కూడా సీజ్ చేయబడటంతో, డబ్బు కోసం తనకి తోచిన పనులను చేస్తూ వెళుతుంటాడు.

అలాంటి అతను ఒక రోజున జాన్వీ (రోస్మిన్) కంటపడతాడు. ఆ తరువాత కూడా ఒకటి రెండు సార్లు ఆమెకి తారసపడతాడు. అతని కేరక్టర్ ఆమెకి చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. శ్రీమంతుడైన రాజారామ్ (సంపత్ రాజ్)కి ఆమె కూతురు. తండ్రి నడుపుతున్న బిస్కట్ కంపెనీకి ఆమె జె ఎమ్ డి గా ఉంటుంది. అలాంటి ఆమె శంతను గురించి తెలుకుని అతనికి తమ సంస్థలో జాబ్ ఇస్తుంది. అప్పటి నుంచి వాళ్లిద్దరి మధ్య పరిచయం మొదలై అది కాస్తా ప్రేమగా మారుతుంది ..పెళ్లి వరకూ వెళుతుంది.

రాజా రామ్ మొదటి భార్య కూతురే జాన్వీ. తన కూతురు శంతనును ప్రేమిస్తుందనే విషయం అతనికి తెలిసిపోతుంది. ఈ విషయంలో అతను కూతురును మందలిస్తాడు. తన అంతస్తుకి తగిన వాడిని పెళ్లి చేసుకోమని చెప్పి, ఒక సంబంధం తీసుకొస్తాడు. అప్పుడు జాన్వీ ఏం చేస్తుంది? ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? శంతనుతో ఆమె జీవితం ఎలా కొనసాగుతుంది? అనేది మిగతా కథ.

రిషభ్ - లక్ష్మీ అనే ఇద్దరు యువతీ యువకులు ప్రేమించుకుని పెళ్లి చేసుకుంటారు. పెళ్లైన మూడు నెలలకే విడిపోవాలని నిర్ణయించుకుంటారు. ఈ విషయంలో కౌన్సిలింగ్ కోసం సైకియాట్రిస్ట్ 'గంగాదేవి'( కస్తూరి)ని కలుస్తారు. తనముందే వాళ్లిద్దరూ పడుతున్న గొడవను చూసిన గంగాదేవి, గతంలో జరిగిన శంతను - జాన్వీ ప్రేమకథను చెప్పడం మొదలుపెట్టడంతోనే అసలు కథ మొదలవుతుంది. ఈ గంగాదేవికి .. ఆ శంతను కథకు లింక్ ఏమిటి? అనే కుతూహలాన్ని రేకెత్తిస్తూ దర్శకుడు ఈ కథను నడిపించాడు.

శ్రీమంతురాలైన జాన్వీ, పేదింటికి చెందిన శంతనును ప్రేమించడం .. తండ్రిని ఎదిరించి పెళ్లి చేసుకోవడం .. తన సంస్థను అతని చేతులలో పెట్టడం .. ఫస్టాఫ్ గా కొనసాగుతుంది. ఇక శంతను తల్లిదండ్రులు ఆ ఇంటికి రావడం .. ఆ పల్లె మనుషుల అలవాట్లు ఆమెకి నచ్చకపోవడం .. వాళ్ల విషయంలో ఆమె కఠిన వైఖరి సెకండాఫ్ పై మరింత కుతూహలాన్ని పెంచుతూ వెళతాయి. భార్యాభర్తల మధ్య ఈగోలు ఈ కథను మరింత వేడెక్కిస్తూ ప్రీ క్లైమాక్స్ దిశగా నడిపిస్తాయి.

సాధారణంగా తండ్రి బాగా డబ్బు - పలుకుబడి ఉన్న వ్యక్తి అయినప్పుడు, కూతురు అతనికి ఇష్టం లేని పెళ్లి చేసుకోవాలనుకున్నప్పుడు .. ఆ తండ్రి ఏం చేస్తాడోననే ఒక టెన్షన్ ఆడియన్స్ కి ఉంటుంది. అందుకు తగినట్టుగానే ఆ తండ్రి రకరకాలుగా ఇబ్బంది పెట్టడం జరుగుతుంటుంది. కానీ అక్కడి నుంచి అందుకు భిన్నంగా ఈ కథ ముందుకు వెళుతుంది. తండ్రి పాత్ర పక్కకి వెళ్లిపోయి, భార్యాభర్తలు తలపడటం కొత్తగా అనిపిస్తుంది.


కథలో ఎక్కువ భాగం హీరో - హీరోయిన్ చుట్టూ తిరుగుతుంది. ప్రేమికులుగా .. భార్యాభర్తలుగా వాళ్ల పాత్రలలో వేరియేషన్స్ ఉంటాయి. వాళ్లిద్దరూ అలా గొడవపడుతూ ఉంటే, చివరిలో కనువిప్పు కలగడం కామనే గదా అనుకుంటాము. కానీ అక్కడే ఎవరూ గెస్ చేయని ఒక ట్విస్ట్ పడుతుంది. ఆ ట్విస్ట్ అప్పటివరకూ చూసిన కథ బరువును పెంచుతుంది. ఈ కంటెంట్ ను యావరేజ్ ప్లేస్ లో నిలబెడుతుంది.

ప్రధానమైన పాత్రలను పోషించిన వాళ్లంతా బాగా చేశారు. డబ్బు .. అహంభావం కూడిన పాత్రలో రోస్మిన్ నటన ఆకట్టుకుంటుంది. తన మాట మాత్రమే నెగ్గాలనే పంతం కలిగిన ఆ పాత్రలో ఆమె అభినయం మెప్పిస్తుంది. ఇక తల్లిదండ్రుల పట్ల బాధ్యతగా మసలుకునే పాత్రలో రానవ్ నటన మంచి మార్కులు కొట్టేస్తుంది. పన్నీర్ సెల్వమ్ ఫొటోగ్రఫీ ..జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం .. ఫరవాలేదు. భాస్కర్ ఎడిటింగ్ ఓకే. తల్లిదండ్రులను ప్రేమించలేనివారు మరెవరినీ ప్రేమించలేరు. బంధాలకు .. అనుబంధాలకు విలువనీయలేరు. ఈగో కారణంగా వైవాహిక జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. సర్దుకుపోవడంలోనే సంతోషం ఉంటుంది అనే సందేశాన్ని ఇచ్చిన ఈ సినిమా, యావరేజ్ కేటగిరీలోకి వస్తుందని చెప్పొచ్చు.

**సినిమా వివరాలు**

సినిమా పేరు: బ్రేక్‌ఫాస్ట్
విడుదల తేదీ: 2026-06-24
నటీనటులు: రానవ్, రోస్మిన్, సంపత్ రాజ్, అర్చన, క్రితిక్ మోహన్, అమృత రంగనాథ్
దర్శకుడు: గాంధీ కృష్ణ
సంగీతం: జి.వి. ప్రకాష్ కుమార్
బ్యానర్: ప్రేమ్ క్లాసిక్ పిక్చర్స్
సమీక్ష: పెద్దింటి
'బ్రేక్‌ఫాస్ట్' రేటింగ్: 5కి 2.00

## 'రంభ ఊర్వశి మేనక'.. మళ్లీ కామెడీ బాటపట్టిన అల్లరి నరేశ్




గత కొంతకాలంగా 'నాంది', 'ఉగ్రం' వంటి సీరియస్, ఇంటెన్స్ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ప్రముఖ నటుడు అల్లరి నరేశ్, మళ్లీ తన ట్రేడ్ మార్క్ కామెడీతో అలరించేందుకు సిద్ధమయ్యారు. అల్లరి నరేశ్ పుట్టినరోజు సందర్భంగా తన 65వ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాకు 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని ఒక సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. టైటిల్‌తోనే సినిమాలో కామెడీ, ఫాంటసీ అంశాలు పుష్కలంగా ఉంటాయని స్పష్టమవుతోంది. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ పతాకాలపై ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చంద్రమోహన్ చింతాడ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లరి నరేశ్ కామెడీ చిత్రాలకు పెట్టింది పేరు. అయితే, నటుడిగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే క్రమంలో ఇటీవల సీరియస్ కథలను ఎంచుకున్నారు. ఇప్పుడు మళ్లీ తన కామెడీ జానర్‌లోకి వస్తుండటంతో అభిమానులు, సినీ ప్రేక్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ సినిమాకు చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, 2026 సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.

## హీరోయిన్ హనీ రోజ్ కు క్షమాపణ చెప్పిన వ్యాపారవేత్త



కేరళకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బాబీ చెమ్మనూర్ హీరోయిన్ హనీ రోజ్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఒక జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవ వేడుకలో హనీ రోజ్‌ను ఉద్దేశించి ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. తనపై లైంగిక భావనలతో కూడిన, అవమానకరమైన వ్యాఖ్యలు చేశారంటూ హనీ రోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చెమ్మనూర్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో, బాబీ చెమ్మనూర్ తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా స్పందిస్తూ, తన వ్యాఖ్యలు హనీ రోజ్‌ను, ఆమె కుటుంబాన్ని బాధపెట్టాయని గ్రహించానని... ఈ ఉదంతానికి పూర్తి బాధ్యత వహిస్తూ మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నానని ప్రకటించారు. ఆమెను బాధపెట్టాలనే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని, ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. అలాగే ఆమె తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, ఈ వివాదంపై గతంలో మాట్లాడిన హనీ రోజ్... తన లుక్స్‌పై వచ్చే సరదా జోకులను, మీమ్స్‌ను తాను కూడా స్పోర్టివ్‌గా తీసుకుంటానని, కానీ ప్రతి దానికి ఒక హద్దు ఉంటుందని స్పష్టం చేశారు. అసభ్యకరమైన, గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను ఏమాత్రం సహించేది లేదని ఆమె తేల్చి చెప్పారు. వ్యాపారవేత్త చెమ్మనూర్ చేసిన ఈ బహిరంగ క్షమాపణలపై హనీ రోజ్ ఇంకా స్పందించాల్సి ఉంది.

## ఇది ప్రభాస్ రేంజ్.. బ్యాంకాక్‌లో పూరి జగన్నాథ్‌కు ఎదురైన ఊహించని అనుభవం!





పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ క్రేజ్ దేశ సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా ఏ స్థాయిలో విస్తరించిందో చెప్పే ఓ ఆసక్తికర సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. కేవలం 'నేను ప్రభాస్ స్నేహితుడిని' అని చెప్పినందుకు ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్‌కు బ్యాంకాక్‌లోని ఓ ఆసుపత్రిలో ఊహించని రీతిలో వీఐపీ ట్రీట్‌మెంట్ లభించింది. ఈ విషయాన్ని ప్రభాస్ స్వయంగా ఇటీవల విడుదలైన 'బాహుబలి: ది టార్చ్ బేరర్' అనే డాక్యుమెంటరీలో అభిమానులతో పంచుకున్నారు.

ప్రభాస్ కథనం ప్రకారం.. 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై ప్రపంచవ్యాప్తంగా సంచలనాలు సృష్టిస్తున్న రోజుల్లో ఈ సంఘటన జరిగింది. దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ చిన్న ఇన్ఫెక్షన్ కారణంగా చికిత్స కోసం బ్యాంకాక్‌లోని ఓ ప్రముఖ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ తన వంతు కోసం వెయిటింగ్ రూమ్‌లో కూర్చుని ఉండగా, ఓ నర్స్ ఆయన వద్దకు వచ్చి ఇండియా నుంచి వచ్చారా? అని అడిగింది. ఆయన అవునని సమాధానం ఇవ్వగానే, ఆమె వెంటనే 'బాహుబలి?' అని ప్రశ్నించింది.

ఆమె ప్రశ్నకు ఆశ్చర్యపోయిన పూరి జగన్నాథ్, తన ఫోన్‌లోని ఓ పర్సనల్ ఫొటోను చూపించారు. ఆ ఫొటోలో ఆయన ప్రభాస్‌తో కలిసి ఉన్నారు. తాను ప్రభాస్‌కు మంచి స్నేహితుడినని ఆ నర్స్‌కు వివరించారు. ఆ ఫొటో చూసిన నర్స్ వెంటనే ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేసింది. దీంతో పూరి జగన్నాథ్‌కు ఎలాంటి వెయిటింగ్ సమయం లేకుండా నేరుగా ఒక ప్రత్యేక గదికి తీసుకెళ్లి, తక్షణమే వైద్య సేవలు అందించారు. ఈ అనూహ్య అనుభవాన్ని పూరి జగన్నాథ్ వెంటనే వాయిస్ మెసేజ్ రూపంలో ప్రభాస్‌కు పంపించారు.

ఆ సమయంలో దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నిర్మాత శోభు యార్లగడ్డతో కలిసి ఉన్న ప్రభాస్, ఆ వాయిస్ మెసేజ్ విని ఆశ్చర్యానికి గురయ్యారు. జపాన్ వంటి దేశాల్లో 'బాహుబలి'కి, ప్రభాస్‌కు భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని వారికి తెలుసు. కానీ, ఎవరూ ఊహించని విధంగా బ్యాంకాక్‌లోని ఓ సాధారణ ఆసుపత్రిలో కూడా 'బాహుబలి' ప్రభావం ఈ స్థాయిలో ఉండటం చిత్రబృందాన్ని సైతం ఆశ్చర్యపరిచింది. ఇది ప్రభాస్ గ్లోబల్ స్టార్‌డమ్‌కు నిదర్శనంగా నిలిచింది.

ఇదే డాక్యుమెంటరీలో ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క శెట్టిలు 'బాహుబలి 3' చిత్రంపై పరోక్షంగా కొన్ని హింట్స్ ఇవ్వడం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఇక, ప్రభాస్ కెరీర్ విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ', సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్', అలాగే 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్ కూడా ఆయన లైనప్‌లో ఉన్నాయి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662